క్లుప్తంగా...

'సీఎం కేసీఆర్ మాయమాటలతో ప్రజలను మోసం చేస్తున్నారు'



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

చాంద్రాయణగుట్ట: సీఎం కేసీఆర్ మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేస్తున్నారని బీజేపీ చాంద్రాయణగుట్ట అసెంబ్లీ కన్వీనర్ గ్యార ప్రభాకర్ అన్నారు. పార్టీ పిలుపు మేరకు చాంద్రాయణగుట్ట చౌరస్తాలో శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని ఎన్నికల్లో ఇచ్చిన మాటను తప్పి.. తాను పీఠంపై కూర్చున్నాడన్నారు. కేంద్రం ఇస్తున్న నిధులను తీసుకొని తీసుకొని..తన గొప్పగా చెప్పుకుంటున్నారన్నారు. మహేందర్, శ్రీనివాసారావు, విజయ్ కుమార్, వేణు, సుభాష్, నాగరాజు, లక్ష్మణ్, వరలక్ష్మి పాల్గొన్నారు.

పేదలను ఆదుకోవాలి



చార్మినార్: సామాజిక సేవా కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలు విరివిగా పాల్గొని సమాజంలోని పేదలకు సేవలను అందించాలని హైదరాబాద్ కుంభ మేళా అగర్వాల్, అశోక్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పంకజ్‌కుమార్ అగర్వాల్ అన్నారు. శుక్రవారం పాతబస్తీ రికాబ్‌గంజ్‌లో అన్న సేవా అనే కార్యక్రమాన్ని ప్రారంభించి పేదలకు అన్న ప్రసాదం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి పేద ప్రజలకు సేవలను అందించాలన్నారు.

కుంభ రవిబాబును కలిసిన ఎరుకల సంఘం నేతలు



గోల్కొండ: తెలంగాణలో ఎరుకల సోదరులు ఏక తాటిపై ఉండి రాజకీయంగా ఎదగాలని ఏపీ ఎమ్మెల్సీ కుంభ రవిబాబు అన్నారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన ఆయనను తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం వారు శుక్రవారం కలిశారు. కలిసిన వారిలో తెలంగాణ రాష్ట్ర ఎరుకల సంఘం నాయకులు కెంబసారం కృష్ణ, కె.కృష్ణ తదితరులున్నారు.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే



డిగ్రీ పట్టాలను ప్రదానం చేస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ శశికళారెడ్డి

సుల్తాన్‌బజార్: ఉస్మానియా మెడికల్ కళాశాలలో 2017 బ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్‌ను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళారెడ్డి డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని, ఎంతో కష్టపడి ఎంబీబీఎస్ సీటు సాధించి డిగ్రీను పూర్తి చేసిన విద్యార్థులకు ఆమె శుభాకాంక్షలు తెలియజేశారు. ఉస్మానియా సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్, కోఠి మెటర్నిటీ వైద్య కళాశాల సూపరింటెండెంట్ డాక్టర్ రాజేశ్వరి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జయ, కిరణ్మయి, టకీరుద్దీన్, డాక్టర్ తిమ్మారెడ్డి, డాక్టర్ సుమలత పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ ఆలయ పునఃప్రతిష్ఠాపన



అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలోని కట్టెలమండి బస్తీలో ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ పునఃప్రతిష్ఠాపన వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. మూడురోజుల పాటు నిర్వహించే వేడుకలను రాష్ట్ర బీజేపీ యువ నాయకుడు ఎం.విక్రమ్‌గౌడ్, ఆయన సతీమణి శిపాలీ విఘ్నేశ్వర పూజతో ప్రారంభించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

టప్పామైసమ్మ ఆలయం ముస్తాబు



గోల్కొండ: టప్పామైసమ్మ ఆలయంలో టప్పా మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన 19వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ వివరాలను ఆలయ కమిటీ ప్రతినిధి సచిన్ కామ్లేకర్ శుక్రవారం వెల్లడించారు. 19న ఉదయం 8 గంటలకు గణపతి పూజతో ప్రారంభమవుతాయి. సాయంత్రం 5 గంటలకు ఆవాహిత దేవతా హోమాలు, జల దివాసం కార్యక్రమాలు ఉంటాయి. 20న ఉదయం 9 గంటలకు మండప దేవత పూజా కార్యక్రమాలు ఉంటాయి. 21న ఉదయం 8 గంటలకు వేదస్వస్తి, ఆవాహిత దేవత పూజా, గర్తన్యాస పూజలు ఉంటాయి. ఈ పూజా కార్యక్రమాలు దర్బార్ మైసమ్మ ఆలయ ప్రధాన పూజారి జోషి రాఘవేంద్ర శర్మ ఆధ్వర్యంలో జరుగుతాయి.

సర్వాయి పాపన్నగౌడ్‌కు ఘన నివాళి



సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాజా సింగ్ తదితరులు

చార్మినార్: గోల్కొండ రాజ్యాన్ని ఏలిన తొలి బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని బహుజన సమాజ్‌వాది పార్టీ చార్మినార్ శాసన సభ నియోజకవర్గం అధ్యక్షుడు రాంచరణ్ అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఎస్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దయానంద్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పురానాపూల్‌లో..

జియాగూడ: బహుజన రాజ్యాధికారం కోసం పోరాడిన యోధుడు సర్దార్ పాపన్నగౌడ్ అని ఎమ్మెల్యే రాజా సింగ్ అన్నారు. శుక్రవారం పురానాపూల్‌లోని సురాభాండేశ్వర గౌండ్ల మంతం, గౌడ సంఘంలో పాపన్నగౌడ్ జయంతిని పురస్కరించుకొని ప్రధాన కార్యదర్శి కొత్త నవీన్ కుమార్‌గౌడ్, సలహాదారులు నిర్మల నీలకంతం గౌడ్, గోదా వెంకటేష్ గౌడ్, బుర్ర భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో పాపన్న విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గోల్కొండ కోటపై దండెత్తి అఖండ విజయం సాధించి రాజ్య పాలన చేశాడని ఆయన కొనియాడారు. గోషామహల్ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్, కార్పొరేటర్లు శశికళ కృష్ణ, లాల్ సింగ్, మాజీ కార్పొరేటర్లు పరమేశ్వరీ సింగ్, ముఖేష్ సింగ్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సుల్తాన్‌బజార్‌లో..

సుల్తాన్‌బజార్: సర్వాయి పాపన్న గౌడ్ జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ జాంబాగ్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ అన్నారు. సర్వాయి పాపన్న జయంతిని పురస్కరించుకుని శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రహీంపురాలో..

అబిడ్స్: సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ధూల్‌పేట రహీంపురాలో ఆయన విగ్రహానికి గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్, మాజీ కార్పొరేటర్ పరమేశ్వరీ సింగ్, బీఆర్‌ఎస్ నాయకులు పప్పుమాత్రే, ఆనంద్‌సింగ్, ధినేష్ సింగ్, శశిరాజ్ సింగ్, శంకర్‌సింగ్ జమేదార్, సునిల్ సింగ్‌లతో పాటు పలువురు నాయకులు పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న నాయకులు



నివాళులర్పిస్తున్న నందకిశోర్ వ్యాస్ బిలాల్, పరమేశ్వరీ సింగ్ తదితరులు



నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ తదితరులు

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట



ఆనంద్‌కుమార్‌గౌడ్ సమక్షంలో మంత్రి తలసానిని కలిసిన మైనార్టీలు

అబిడ్స్: మైనార్టీలకు సమక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో నియోజకవర్గానికి చెందిన పలువురు మైనార్టీ నాయకులు మంత్రి తలసానిని కలిసి పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మైనార్టీల కోసం కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశంలోని ఏ రాష్ట్రంలో లేవన్నారు. ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ..నియోజకవర్గంలోని సమస్యలన్ని మంత్రి తలసాని దృష్టికి తీసుకువెళ్లి ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నందుకుమార్, మహ్మద్ అహ్మద్, మహ్మద్ సలీం, గౌస్, అస్సద్, సిరాజ్, మీరాజ్ బేగం, అమ్రిన్ బేగం పాల్గొన్నారు.

పోలీసు విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తికి జరిమానా

చాంద్రాయణగుట్ట: ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసు విధులకు ఆటంకం కలిగించిన యువకుడికి న్యాయస్థానం రూ. పదివేల జరిమానా విధించింది. ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. ఫాతీమానగర్‌కు చెందిన షేక్ మహ్మద్ అలియాస్ దాబా(38) 2016లో పోలీసుల విధుల కు అడ్డు తగిలాడు. కేసు నమోదు చేసిన పోలీసులు ఛార్జిషీట్ దాఖలు చేయగా కేసును విచారించిన 16వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ రాధికా జైస్వాల్ నిందితుడికి రూ.పది వేల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు వెలువరించారు.

'దేశీయ ఖాదీ ఉత్పత్తుల విక్రయాల్లో గణనీయమైన వృద్ధి'

నాంపల్లి: ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) ఆధ్వర్యంలో శుక్రవారం రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లోని తన ప్రాంగణంలో చేనేత వస్త్ర ప్రదర్శనను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో సుమారు 20 మంది చేనేత కార్మికులు తమ ఉత్పత్తులను ప్రదర్శించారు. ముఖ్యఅతిథిగా ఖాదీ, విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ (కేవీఐసీ) రాష్ట్ర సంచాలకులు డాక్టర్ మనోజ్ లంక హాజరై ప్రదర్శనను ప్రారంభించి ప్రసంగించారు. దేశంలో ఖాదీ పరిశ్రమ అభివృద్ధి చెందుతున్నట్లు వివరించారు. ఖాదీ, విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ ఉత్పత్తుల టర్నోవర్ రూ.1.34 కోట్లను అధిగమించిందని చెప్పారు.

హల్దీరామ్ స్టోర్ ప్రారంభం

గోల్కొండ: హల్దీరామ్ రుచులను నగర ప్రజలకు అందించడానికి తమ స్టోర్‌ల సంఖ్యను పెంచుతున్నామని హల్దీరామ్ హైదరాబాద్ సిటీ ఆపరేషన్స్ హెడ్ మంగేష్ ప్రూడ్ అన్నారు. శుక్రవారం అత్తాపూర్ పిల్లర్ నెంబర్ 181 వద్ద హల్దీరామ్ మార్కెటింగ్ హెడ్ శుభమ్ శుక్లాతో కలిసి ఆయన హల్దీరామ్ స్టోర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతీయ వంటకాల రుచులను నగరవాసులకు రుచి చూపించడమే లక్ష్యంగా తాము హల్దీరామ్ స్టోర్‌ల సంఖ్యను పెంచుతున్నామన్నారు. జైన్‌ఫుడ్ ఆప్షన్స్‌తో పాటు పిన్నాంజా వంటి కొన్ని సరికొత్త వెరైటీలు అందుబాటులోకి తెచ్చామన్నారు. 80 ఏళ్ల అనుభవంతో తాము ఈ రంగంలో ముందుకు సాగుతున్నామన్నారు.



హల్దీరామ్ స్టోర్‌ను ప్రారంభిస్తున్న మంగేష్, శుభమ్ శుక్లా తదితరులు

శ్రీనిధికి స్వర్ మహతి కళాపరిషత్ అవార్డు



శ్రీనిధికి అవార్డు అందజేస్తున్న దైవాజ్ఞశర్మ

అబిడ్స్: శ్రీనిధికి స్వర్ మహతి కళాపరిషత్ ఆధ్వర్యంలో ఉత్తమ కూచిపూడి అవార్డును అందజేశారు. సృజనోత్సవ్-2023లో భాగంగా విద్యాభారతి హైస్కూల్ విద్యార్థి వి.శ్రీనిధి సంతోష్‌కు కూచిపూడి సబ్ జూనియర్‌లో ఫస్ట్ ప్రైజ్ అవార్డు అందజేసి సన్మానం చేశారు. రవీంద్రభారతిలో జరిగిన అవార్డుల కార్యక్రమంలో శ్రీనిధి సంతోష్‌కు దైవాజ్ఞశర్మ అవార్డు, సర్టిఫికెట్లను బహూకరించారు. బాల్యంలోనే కూచిపూడిలో ప్రతిభను కనబరుస్తున్న శ్రీనిధిని పాఠశాల యాజమాన్యం, దైవాజ్ఞశర్మతో పాటు పలువురు అభినందించారు.

అసంపూర్తి పనులతో ప్రమాదాలు

చార్మినార్: కుర్మగూడలో కొత్త రోడ్డు వేయడానికి ఉన్న రోడ్లు తవ్వి వదిలేయడంతో స్థానికులు ప్రమాదాలకు గురవుతున్నారు. రెండు వారాలకు పైగా రోడ్డు నిర్మాణం పనులు పూర్తి కాకపోవడమే కాకుండా మ్యాన్‌హోళ్ల మూతలు తెరిచి ఉండటంతో గురువారం సాయంత్రం చంపాపేట్‌కు చెందిన కృష్ణమూర్తి అనే వాహనదారుడు ప్రమాదవశాత్తు మ్యాన్‌హోల్ గుంతలో పడి స్వల్ప గాయాలకు గురయ్యారు. సాధ్యమైనంత వెంటనే రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

తెలంగాణ రాష్ట్ర పెన్షనర్ల సమన్వయ కమిటీ ఎన్నిక



సుల్తాన్‌బజార్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ స్టేట్ గవర్నమెంట్ యునైటెడ్ పెన్షనర్స్ కో ఆర్డినేషన్ కమిటీ ఎన్నికయ్యింది. చైర్మన్‌గా దామోదర్‌రెడ్డి, సెక్రటరి జనరల్‌గా చంద్రశేఖర్, కోశాధికారిగా హన్మంత్‌రెడ్డి, కో చైర్మన్‌లుగా రాజమల్లయ్య, వెంకటయ్య, వైస్ చైర్మన్‌లుగా లక్ష్మారెడ్డి, జంగయ్య, కార్యదర్శిగా రాజేశ్వర్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా రామాంజనేయులు, యాదయ్య, పబ్లిసిటీ సెక్రటరిగా ప్రహ్లాదరావు ఎన్నికయ్యారు. గంగిరెడ్డి, విశ్వనాథం, మోహన్‌రెడ్డి, పెంటయ్య పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్ కార్యక్రమాన్ని విస్తృతం చేస్తాం



ఏసీపీ జావేద్‌ను సన్మానిస్తున్న లక్ష్మీనారాయణ, వెంకటేష్ యాదవ్

జియాగూడ: కుల్సుంపురా పోలీస్ డివిజన్ పరిధిలో ఫ్రెండ్లీ పోలీసింగ్ కార్యక్రమాన్ని విస్తృత పరుస్తామని కుల్సుంపురా ఏసీపీ జావిద్ అన్నారు. శుక్రవారం జియాగూడ బీజేపీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఏసీపీ జావేద్‌ను కలిసి ఆయనను సన్మానించారు. ఏసీపీ మాట్లాడుతూ.. రాబోయే గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. గోల్కొండ జిల్లా డైరి సెల్ కన్వీనర్ శివకుమార్‌యాదవ్, కార్యవర్గ సభ్యులు రమేష్ చౌగ్లే, యువమోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడు రేపాక సంతోష్, డివిజన్ యువమోర్చా అధ్యక్షుడు రాజ్‌పోల్, ప్రధాన కార్యదర్శి దుర్గుల నరేష్, అశోక్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

గన్‌ఫౌండ్రీ: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలని ప్రముఖ మృదంగ విద్వాంస నిపుణులు వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో స్వర మహతి కళాపరిషత్ ఆధ్వర్యంలో సృజనోత్సవ్ –2023 వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఉన్న విభిన్న సంస్కృతులపై జాతీయ స్థాయి పోటీలను నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞ శర్మ, సుమన్ టీవీ సీఈఓ ఈశ్వర్‌రావు, సంస్థ అధ్యక్షుడు ఆదిత్య కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి



కార్మికులకు కరపత్రాలు పంచుతున్న నాగేశ్వర్

అఫ్జల్‌గంజ్: జీహెచ్‌ఎంసీ స్వీపింగ్ కాంట్రాక్టు కార్మికులను పర్మనెంట్ చేస్తామన్న హామీ అమలుకు, నెలకు రూ.24000 వేతనం సాధన కోసం శనివారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ గోషామహల్ జోన్ నాయకులు నాగేశ్వర్, జంగయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం బేగంబజార్, గౌలిగూడ, దారుస్సలాం, గోడేకీకబర్, మంగళ్‌హాట్, పురానాపూల్, ఆగాపురా, అబిడ్స్, గన్‌ఫౌండ్రి, కోఠి, అఫ్జల్‌గంజ్, చుడిబజార్ తదితర ప్రాంతాల్లో పర్యటించి ఆయా ప్రాంతాల కార్మికులకు కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కారం కాక కార్మికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్



డెంగీ, మలేరియా వ్యాధులపై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: డెంగీ, మలేరియా వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అధికారులను కోరారు. శుక్రవారం నానల్‌నగర్ డివిజన్ హకింపేట్‌లో డెంగీ, మలేరియా వ్యాధులపై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఆయన తిలకించారు. బల్దియా ఎంటమాలజీ విభాగం వారు ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్‌లో దోమలు, వాటి వల్ల ప్రబలే వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్వాన్ నియోజకవర్గంలో గత వారాలుగా విష జ్వరాలు బాగా వ్యాప్తి చెందాయన్నారు. భారీ వర్షాలు కురిసిన అనంతరం దోమలు వృద్ధి చెందాయని ఆయన అన్నారు. దోమల నివారణకు ఎంటమాలజీ అధికారులు తీసుకుంటున్న చర్యలు సంతృప్తికరంగా లేవన్నారు. కార్వాన్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో మూసీ తీరం వెంట దోమలు వృద్ధి చెందుతున్నాయని ఆ ప్రాంతంలో దోమల నివారణకు బల్దియా అధికారులు చేసిందేమి లేదని ఆయన పేర్కొన్నారు. ప్రణాళిక బద్ధంగా దోమల నివారణకు కృషి చేస్తే దోమలు వృద్ధి చెందేవి కాదని ఆయన అన్నారు. మరోవైపు నాలాలు, చెరువులలో కూడా దోమలు వృద్ధి చెందుతున్నాయన్నారు. గోల్కొండ కోట కందకాలు, శాతం చెరువు, కతోరా హౌస్ తదితర ప్రాంతాలు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయని ఆయన అన్నారు. ఈ ప్రాంతాల్లో దోమల నివారణకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని ఆయన కోరారు. ప్రభుత్వ దవాఖానాల్లో డెంగీ, మలేరియా వ్యాధులతో వచ్చే వారి సంఖ్య బాగా పెరిగిందని ఎమ్మెల్యే అన్నారు. బస్తీ దవాఖానాలతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సైతం వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరిగితే స్థానికంగా దోమలు వృద్ధి చెందవన్నారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ అధికారిణి రజని, ఎంటమాలజీ సూపర్‌వైజర్లు తదితరులున్నారు. అనంతరం ఎంటమాలజీ వారు నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు.

గోషామహల్ కాంగ్రెస్ టికెట్‌కు దరఖాస్తు

అబిడ్స్: గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం నియోజకవర్గంలోని సీనియర్ నాయకుడు, కాంటెస్టెడ్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎస్.మధుసుధన్‌గుప్తా దరఖాస్తు చేసుకున్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ ప్రారంభించిన దరఖాస్తుల్లో మధుసుధన్ గుప్తా దరఖాస్తు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. 2004లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన అనుభవం ఉందన్నారు. 30 ఏళ్లకు పైగా కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకులుగా కొనసాగుతున్న తనకు టికెట్ ఇస్తే గోషామహల్‌లో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తానన్నారు.



మహేష్‌కుమార్‌గౌడ్‌కు దరఖాస్తు అందజేస్తున్న మధుసుధన్ గుప్తా

ఓటరు నమోదుపై అవగాహన



ఓటరు నమోదు ఆవశ్యకతను వివరిస్తున్న బీజేపీ నాయకుడు దేవర వంశీ

గోల్కొండ: ఓటరు లిస్టులో పేరు ఉన్నది లేనిది ముందుగానే చెక్ చేసుకోవాలని సీనియర్ బీజేపీ నాయకుడు దేవర వంశీ కోరారు. శుక్రవారం ఆయన గుడిమల్కాపూర్ డివిజన్‌లో ఇంటింటికీ తిరిగి ఓటరు లిస్ట్, పేరు నమోదుపై అవగాహన కల్పించారు. స్థానికంగా ఉంటూ ఓటరు లిస్ట్‌లో తమ పేరు వేరే ప్రాంతంలో ఉన్న వారు తమ పేరును కొత్త ప్రాంతంలోని ఓటరు లిస్ట్‌లో ట్రాన్స్‌ఫర్ చేసుకోవాలని సూచించారు. ఇంత వరకు ఓటరు లిస్ట్‌లో పేరు లేనివారు సైతం తమ పేర్లను నమోదు చేసుకోవాలని 18 ఏళ్లు నిండిన వారు సైతం కొత్తగా తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని ఆయన స్థానికులను కోరారు. శ్రీకాంత్‌సాగర్, ప్రభు, పవన్‌సింగ్, అశ్విన్ తదితరులున్నారు.

విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించాలి



మాట్లాడుతున్న జిల్లా సైన్స్ అధికారి ధర్మేంద్ర

చార్మినార్: విద్యార్థులు పోటీ పరీక్షల్లో తమ ప్రతిభను కనబరచాలని హైదరాబాద్ జిల్లా సైన్స్ అధికారి ధర్మేంద్ర అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ ద్వారా నిర్వహిస్తున్న ఇన్‌స్పైర్ అవార్డుల కోసం విద్యార్థులను ఎంపిక చేసేందుకు డాన్ హైస్కూల్‌లో శుక్రవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రెగ్యులర్ విద్యాభ్యాసంతో పాటు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో తమ ప్రతిభను చాటే విధంగా విద్యార్థులు కష్టపడాలన్నారు. ఇన్‌స్పైర్ అవార్డుల కోసం ఈనెల 31వ తేదీ లోపు జంట నగరాలలోని ప్రతి పాఠశాల నుంచి 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఐదుగురు విద్యార్థులను ఎంపిక చేయాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆర్సీ బిలోరియా, డాక్టర్ అబ్బాస్ అహ్మద్, షజీవుల్లా ఫిరాసత్, డాన్ విద్యాసంస్థల చైర్మన్ ఫజల్ ఉర్ రెహ్మాన్ ఖుర్రం, విద్యావేత్త చౌహాన్ పాల్గొన్నారు.

జేఎన్‌ఏఎఫ్‌ఏయూలో నూతన పీజీ కోర్సు



జ్యోతిప్రజ్వలనలో కవిత దరియానిరావు, సుందర్‌కుమార్ తదితరులు

విజయనగర్‌కాలనీ: ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునేలా నిర్మాణాలు చేపట్టే సాంకేతిక నిపుణులను తయారు చేసేందుకు అనుగుణంగా కొత్త కోర్సులను ప్రవేశపెడుతున్నట్లు జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ కవిత దరియానిరావు అన్నారు. మాసబ్‌ట్యాంక్ జేఎన్‌ఏఎఫ్‌ఏయూలో శుక్రవారం మాస్టర్స్ ఆఫ్ టెక్నాలజీ, ఎనర్జీ అండ్ సస్టేనబుల్ బిల్ట్ ఎన్విరాన్‌మెంట్ పేరిట నూతనంగా అందుబాటులోకి తీసుకువచ్చిన పీజీ కోర్సును ప్రవేశపెట్టారు. ఆమె ఈ కోర్సుకు మన దేశంలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు, ఉద్యోగ అవకాశాలు ఉన్నట్లు పేర్కొన్నారు. తెలంగాణలో ప్రథమంగా ఈ కోర్సును ప్రవేశపెడుతున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా సావనీర్‌ను ఆవిష్కరించారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ కొడాలి సుందర్‌కుమార్, ఎస్‌పీఏ ప్రిన్సిపాల్ సీహెచ్. శ్రీనివాస్, ఫైనార్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గంగాధర్ పాల్గొన్నారు.

రెయిలింగ్ గోడ కూలి మహిళ మృతి

లంగర్‌హౌజ్: రెయిలింగ్ గోడ కూలి ఓ మహిళ మృతి చెందిన ఘటన లంగర్‌హౌజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై రాఘవేంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటకకు చెందిన శివమ్మ(40) నాలుగేళ్ల క్రితం లంగర్‌హౌజ్‌కు వలస వచ్చి లక్ష్మీనగర్ సమీప ప్రాంతంలో ఉంటుంది. స్థానికంగా ఆమె కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం ఆమె లక్ష్మీనగర్‌లో ఓ భవన నిర్మాణం వద్ద కూలీ పనులకు వెళ్లింది. సెకండ్ ఫ్లోర్ నుంచి ఓ కట్టె కిందకి అందిస్తుండగా ఇటీవల కొత్తగా నిర్మించిన రెయిలింగ్ గోడ కూలి కిందపడింది. తీవ్రంగా గాయపడిన ఆమెను వెంటనే చికిత్స నిమిత్తం గోల్కొండ ఏరియా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందింది. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు పిల్లలతో సహా దంపతుల అదృశ్యం



గౌలిపురా: భార్య, పిల్లలతో కలిసి ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మురాద్‌మహల్‌కు చెందిన ఆర్కిటెక్ డిజైనర్ మహ్మద్ నవీద్ అలీ (38), అతని భార్య ఆఫ్రిన్ బేగం(36), పిల్లలు అఫ్సాబేగం(5), మహ్మద్ ఉమర్ అలీ(3) అలీ కుటుంబం ఈనెల 6న బయటికి వెళ్లి తిరిగి రాలేదు. స్థానికంగా గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. శుక్రవారం కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.